

## పెళ్లయినా.. పార్టీలైనా స్పెషల్ ఎట్రాక్షన్..

# ఇండియన్ మైకేల్ జాక్సన్

అంబానీలో,అరబ్‌షేక్‌లో ఆనందించాలనుకుంటే, అరక్షణం ఆలస్యం చేయకుండా బాలీవుడ్ టాప్‌స్టార్‌లే వారి ముంగిట్లో వాలిపోయి ముచ్చటగా నృత్యం చేసేస్తారు. మాఫియా డాన్‌లు తలుచుకుంటే నేటి బాలీవుడ్ ముద్దుగుమ్మలు, నిన్నటి మందాకినీ, మోనికా బేడీలని మించిపోయి మరీ 'మాఫియా పార్టీ'లో చిందులేస్తారు. పెద్దింటి పెళ్ళి వేడుకల్లో సినీతారల నృత్యాలు నేడు అత్యంత సహజం. కానీ ఎవరు ఆనందించాలనుకున్నా, ఎంతటి వారు తలుచుకున్నా పాప్‌కింగ్ మైకేల్‌జాక్సన్ చేత తాము కోరిన విధంగా తమ పార్టీల్లోనో, పెళ్లిళ్లోనో డ్యాన్స్ చేయించగలరా... దాదాపు అసాధ్యమేమో కదా. కానీ ప్రస్తుతం హైదరాబాద్ నగరవాసులకు మాత్రం 'కొంతవరకూ' అది సాధ్యమే. అచ్చం మైకేల్ జాక్సన్‌ను తలపించే మరో జాక్సన్ జంట నగరాల్లో సందడి చేస్తున్నాడు. వేషధారణలోనూ, వెరైటీ నృత్యాలలోనూ మైకేల్‌ను గుర్తుకు తెచ్చే విధంగా అందరినీ ఆకర్షిస్తోన్న ఈ హైదరాబాద్ హిమాయత్‌నగర్ నివాసి ప్రస్తుతం పార్టీల్లో, ఈవెంట్లలో స్పెషల్ ఎట్రాక్షన్. మున్నాకసిరి అనే పేరుకల్గిన పాతికేళ్ళ యువకుడు చిన్ననాటి నుంచీ 'జాక్సన్' వీరాభిమాని. జాక్సన్ మ్యూజిక్ వీడియోలన్నీ ఒకటికి పదిసార్లు చూసి, చూసి చివరకు ఓ శుభముహూర్తాన తనని తాను 'ఇండియన్ జాక్సన్'గా ప్రకటించేసుకున్నాడు. తొలుత అందరూ ఎగతాళిగా నవ్వినప్పటికీ పట్టించుకోలేదు.

జాక్సన్ లాగ జుత్తుదువ్వడం, డ్రస్‌చేసుకోవడం, నలుగురూ కోరితే మొహమాటం లేకుండా జాక్సన్ డ్యాన్సులు చేసేయడం... అలా అలా ఎగతాళి చేసినవారు కూడా చివరకు తనని పిల్చి మరీ డ్యాన్సు చేయించుకునే స్థాయికి ఎదిగాడు. ఆనోటా ఈనోటా ఈ ఇండియన్ జాక్సన్ గురించి విన్న నగరంలోని ఫ్యామిలీక్లబ్‌లు, రిసార్ట్స్ నిర్వాహకులు, ఈవెంట్ మేనేజర్‌లు మున్నాకసిరి ప్రోగ్రాంలు కూడా ఏర్పాటు చేయడం మొదలు పెట్టారు. అంతే మనవాడు సిటీలోని పార్టీ పీపుల్‌కి చెందిన 'మోస్ట్ వాంటెడ్' ఆర్టిస్టుల జాబితాలో చేరిపోయాడు.

మైకేల్ జాక్సన్ పుట్టినరోజు ఏ తేదీనో మనలో చాలామందికి తెలియకపోవచ్చుగాని అదే మున్నాకసిరి మాత్రం ఆ రోజున హైదరాబాద్‌లోని పలు పబ్‌లలో యువతీ యువకుల కేరింతల మధ్య ఆగస్టు 29వ తేదీన జాక్సన్ బర్త్‌డేని ఘనంగా చేసేస్తాడు. కేక్ కట్‌చేస్తాడు. నృత్యాలతో అలరిస్తాడు. మైకేల్ జాక్సన్‌ని తప్ప మరిదేనినీ పెద్దగా పట్టించుకోని మన మున్నాని చూడాలంటే హైదరాబాద్ రావాల్సిందే. వచ్చినా ఎక్కడైనా కన్పడితే 'మున్నా' అని పిలవకండేం. ఎందుకంటే అసలు జాక్సన్‌నైనా వేరేపేరుతో పిలిస్తే ఊరుకుంటాడేమోగాని మన కొసరు జాక్సన్ మాత్రం "నాన్సెన్స్.. హూ ఈజ్ మున్నా.. మై నేమ్ ఈజ్ మైకేల్ జాక్సన్" అంటూ పాప్ స్టయిల్లో స్పందిస్తాడు.

**- యస్బీ**

**మైకేల్ జాక్సన్ పుట్టినరోజు ఏ తేదీనో మనలో చాలామందికి తెలియకపోవచ్చుగాని అదే మున్నాకసిరి మాత్రం ఆ రోజున హైదరాబాద్‌లోని పలు పబ్‌లలో యువతీ యువకుల కేరింతల మధ్య ఆగస్టు 29వ తేదీన జాక్సన్ బర్త్‌డేని ఘనంగా చేసేస్తాడు. కేక్ కట్‌చేస్తాడు. నృత్యాలతో అలరిస్తాడు.**



మైకేల్ జాక్సన్